క్లుప్తంగా

వేడుకగా కుంభాభిషేకం



గంగమ్మను దర్శించుకుంటున్న పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని కల్లి పూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయ కుంభాభిషేకం పూజలు ఆదివారం వేడుకగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి హాజరయ్యారు. ఆమెకు గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, పార్టీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు, సర్పంచ్ నాగేంద్ర, నాయకులు పెరుమాళ్‌రెడ్డి, మునిరాజారెడ్డి, శోభన్‌బాబు, సుబ్రమణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయంలో చోరీ



చోరీ జరిగిన అంకమ్మ ఆలయం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం లింగమ నాయుడుపల్లి పంచాయతీలో నూతనంగా నిర్మించిన శ్రీఅంకమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఇటీవల గుడి నిర్మాణం పూర్తవడంతో గ్రామస్తులు నెల రోజుల క్రితం మహా కుంభాభిషేకం నిర్వహించారు. అమ్మవారి గుడి గ్రామానికి శివారులో ఉండడంతో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి నగలు, దీప స్తంభాలు, ఎలక్ట్రికల్ వస్తువులు అపహరించారు. వీటి విలువ సుమారు రూ. లక్ష ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఉచిత యోగా శిక్షణ



యోగా సాధన చేస్తున్న సభ్యులు

శ్రీకాళహస్తి: శ్రీశుకబ్రహ్మ ఆశ్రమంలో ఉచిత యోగా శిక్షణ ఇస్తున్నామని యోగా గురువు సి. మార్కండేయులు తెలిపారు. ఆదివారం యోగా సాధకులకు వామన దౌతి (గజకర్ణి) చేయించారు. ఆయన మాట్లాడుతూ.. గోరువెచ్చని నీటిలో తగిన మోతాదులో సైంధవ లవణం కలిపి ఆ నీటిని పొట్టనిండా తాగి వెంటనే నోటి ద్వారా వామనం చేసుకుంటే సైనస్, ఊబకాయం ఉన్న వారికి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఈ క్రియను వారంలో ఓ రోజు చేసుకుంటే మంచిదన్నారు. ఇందు కోసం గురువు పర్యవేక్షణలో శిక్షణ పొందాలని అన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో డాక్టర్లతో ఎమ్మెల్సీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని బాబు అగ్రహారం ఉన్నత పాఠశాలలో ఆధ్యాత్మిక అవధూత మాస పత్రిక ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని విశ్రాంత ఉపాధ్యాయులు చిట్టత్తూరు రామ కష్టయ్య వైద్య, పత్రికా గౌరవ సలహాదారు ముచ్చేలి సురేంద్రబాబు, ఎడిటర్ ఆనంద రెడ్డి ప్రారంభించారు. తిరుపతి నుంచి వచ్చిన ప్రముఖ వైద్యులు సుమారు 800 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ శ్రీహరి రావు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నియంత్రించాలి

పుత్తూరు రూరల్: మానవ అక్రమ రవాణాను నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర అన్నారు. ఆదివారం మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. బాలికలు, మహిళలు అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు తల్లిదండ్రులకు తెలియకుండా బయటకు వెళ్లరాదని చెప్పారు. మానవ అక్రమ రవాణా చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా శిక్షార్హులని తెలిపారు. మానవ అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సదస్సులో వసతి గృహాల వార్డెన్లు జయసుధ, భాను పాల్గొన్నారు.

చంద్రగిరిలో ఇసుక రీచ్‌ల నిలిపివేత

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలంలోని నాగయ్యగారిపల్లి, రెడ్డివారిపల్లెలో ఇసుక రీచ్‌లను నిలిపివేస్తున్నట్లు తహసీల్దార్ శిరీష, సీఐ రాజశేఖర్ తెలిపారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ ఇసుక రీచ్‌లను నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇసుక రీచ్‌లలోకి ఎవరినీ అనుమతించడం లేదని, ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక రీచ్‌ల వద్ద పర్యవేక్షించాలని రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు.

ప్రారంభానికి ముస్తాబు

అద్దె ఇళ్లలో..పూరి గుడిసెల్లో దశాబ్దాలపాటు అవస్థలు పడిన పేదల కల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సాకారమైంది. గత ప్రభుత్వాల హయాంలో ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరిగినా పేదవర్గాలకు వ్యయప్రయాసలే మిగిలాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏ పేదవాడూ సొంతిల్లు లేకుండా బాధ పడకూడదని 'పేదలందరికీ ఇళ్లు' పథకం కింద జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించారు. నాగలాపురం మండలంలో 1002 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 724 పూర్తయ్యాయి. లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.



నాగలాపురంలో కళకళలాడుతున్న జగనన్న కాలనీ

- పేదల సొంతింటి కల సాకారం
- నాగలాపురం మండలంలో 1002 ఇళ్లు మంజూరు
- 724 ఇళ్లు పూర్తి
- వివిధ దశల్లో 273 గృహాలు
- రూ.13.65 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం

పిచ్చాటూరు: నాగలాపురం మండలంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 724 ఇళ్లు పూర్తయ్యాయి. ఇందు కోసం రూ.13.65 కోట్లను లబ్ధిదారులకు అందించినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.11.84 కోట్లను నగదు రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయగా, మరో రూ.1.81 కోట్లు విలువ చేసే సిమెంటు, స్టీలు వంటి ఇంటి నిర్మాణ సామగ్రిలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మండలంలో 1,002 మందికి ఇళ్లు మంజూరు చేశారు. ఇందుకోసం 24.45 ఎకరాల భూమిని వివిధ గ్రామాల్లో కేటాయించారు. జగనన్న కాలనీల పేరిట లేఅవుట్‌లు వేసి పేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. నాగలాపురం విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక ఉన్న సుమారు 6.22 ఎకరాల భూమిని జగనన్న కాలనీగా తీర్చిదిద్ది అత్యధికంగా 364 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు. ఇప్పటి వరకు మండలంలో మొత్తం 724 ఇళ్లు పూర్తయి గృహ ప్రవేశానికి ముస్తాబు కాగా, మిగిలిన 273 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.



పూర్తయిన ఇల్లు

నాగలాపురం మండలంలో..

మంజూరైన ఇళ్లు :	1002
లే అవుట్‌లు :	6
ఇప్పటి వరకు పూర్తయినవి :	724
బేస్మెంట్ లెవల్‌లో ఉన్నవి :	120
రూఫ్ లెవల్‌లో ఉన్నవి :	129
మోల్డింగ్ పూర్తయినవి :	24
ఇంకా ప్రారంభం కాని ఇళ్లు :	05
ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు :	220
ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం :	రూ.13.65 కోట్లు
లబ్ధిదారులకు అందించిన మొత్తం :	రూ.11.84 కోట్లు
పంపిణీ చేసిన ఇంటి నిర్మాణ సామగ్రి విలువ :	రూ.1.81 కోట్లు

కలగానే మిగిలిపోతుందనుకున్నా



నేను రోజువారీ కూలీని. నా కొడుకు కూడా కూలీ పని చేస్తున్నాడు. సొంతింటి ఆశ కలగానే మిగిలిపోతుందనుకున్నా. జగనన్న ప్రవేశపెట్టిన పేదలందరికీ ఇళ్లు పథకంతో ఇంటి పట్టా అందుకున్నాను. ఇంటి నిర్మాణం కూడా పూర్తి చేశాం. నమ్మలేకపోతున్నా. చాలా సంతోషంగా ఉంది. మా కలను నిజం చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– సుమతి, జగనన్న కాలనీ, నాగలాపురం

సొంతింటి కల సాకారమైంది



నా కొడుకు ఓ దుఖాణంలో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సొంత ఇల్లు కట్టుకోవాలనే ఆశ ఉన్నా స్థోమత లేదు. ఏళ్ల తరబడి బాడుగ ఇంట్లో ఉంటున్నాం. రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చి ఇల్లు మంజూరు చేసింది. ప్రభుత్వం ఇచ్చిన బిల్లులతో పాటు కూడబెట్టుకున్న డబ్బుతో ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేశాం. ఇప్పుడు మా ఇల్లు గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉంది. జగనన్న వల్లే మా సొంతింటి కల సాకారమైంది.

– వాసంతి, జగనన్న కాలనీ, నాగలాపురం

రుణపడి ఉంటాం



నా కుమారుడు టైలర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అద్దె ఇంట్లో ఉంటూ అద్దె కట్టలేక తీవ్ర ఇబ్బంది పడేవాళ్లం. స్థలం కొని ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. ఆ సమయంలో ప్రభుత్వం పేదలందరికీ ఇల్లు పథకం ద్వారా స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మిస్తారని తెలిసింది. వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాం. ఇంటి పట్టా, ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం ఇంటి పని దాదాపు పూర్తయింది. నా మనవడులాంటి జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– వల్లియమ్మ, జగనన్న కాలనీ, నాగలాపురం

సొంతింట్లో సంతోషంగా ఉన్నాం



మాకు పెళ్లయి 15 ఏళ్లు అవుతోంది. ఇప్పటి వరకు సొంత ఇల్లు లేదు. ముగ్గురు పిల్లలు, నా భర్త, నేను మూడు నెలల క్రితం వరకు బాడుగ ఇంట్లో ఉన్నాం. ప్రభుత్వం జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేయడంతో వెంటనే ఇల్లు నిర్మాణం ప్రారంభించి అందరికంటే ముందుగా పూర్తి చేశాం. మూడు నెలల క్రితం గృహ ప్రవేశం చేశాం. సొంత ఇంట్లో సంతోషంగా నిశ్చింతగా ఉంటున్నాం.

– సుభాషిణి, నాగలాపురం

త్వరలో గృహ ప్రవేశాలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో సామూహిక గృహ ప్రవేశాలు ద్వారా ప్రారంభోత్సవాలు చేయనున్నాం. కొన్ని భవనాలకు సున్నం వేయాల్సి ఉంది. చిన్న చిన్న పనులు పూర్తి చేస్తున్నాం. ఉచితంగా విద్యుత్ కనెక్షన్, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. వివిధ దశలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– బి.హరిబాబు, హౌసింగ్ ఏఈ, నాగలాపురం

నేడు దర్గాలో రొట్టెల పండుగ

శ్రీకాళహస్తి: మోహరం ఉత్సవాల్లో భాగంగా హజ్రత్ జూమ్లే షాపీర్ దర్గాలో సోమవారం సాయంత్రం రొట్టెల పండుగకు ఏర్పాటు చేస్తున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. మతసామరస్యానికి ప్రతీక అయిన ఈ దర్గాలో మతాలకు అతీతంగా భక్తులు పాల్గొంటారని చెప్పారు.

నిత్యాన్నదానానికి రూ.75 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన భక్తుడు నాగేశ్వరరావు ఆదివారం రూ.75 వేలు విరాళం ఇచ్చారు. నగదును ఆలయ కార్యాలయంలో ఏఈఓ సతీష్ మాలిక్, సూపరింటెండెంట్ విజయసారథికి అందజేశారు. అధికారులు వారికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు.

ముక్కంటి సేవలో యూపీ మంత్రి



కుటుంబం సభ్యులతో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి సురేష్ రాహి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి సురేష్ రాహి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ప్రత్యేక రాహుకేతు పూజల్లో పాల్గొని స్వామి అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామిఅమ్మవార్ల జ్ఞాపికతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. వారి వెంట బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, పార్టీ నాయకులు ఉన్నారు.

చెంగాళమ్మకు ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట చెంగాళమ్మ జాతరను పురస్కరించుకుని ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారితో పాటు ఆలయ ప్రాంగణంలోని సుబ్రమణ్యస్వామి, వినాయకస్వామి విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి అంబలి, పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూజల అనంతరం చెంగాళమ్మను గ్రామంలో ఊరేగించారు. ఆలయంలో వేసిన అమ్మవారి ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



చెంగాళమ్మ ముగ్గు, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సిపాయి భరోసా పంపిణీ

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ గొల్లపల్లికి చెందిన సుబ్బమ్మ కుటుంబానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆదివారం 40 రకాల నిత్యావసర సరుకులతో కూడిన సిపాయి భరోసా కిట్టును అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు, సర్పంచ్ ఈశ్వరమ్మ, స్థానిక నాయకులు గోపాల్‌రెడ్డి, మునిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి

ముస్లింలకు అండగా ఉంటాం



ముస్లింల సమావేశంలో బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: ముస్లింల ఉన్నతికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కట్టుబడి ఉన్నారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రా రెడ్డి అన్నారు. రేణిగుంట శ్రీనివాస జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఆదివారం ఆ పార్టీ ముస్లిం మైనార్టీ మండల స్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పవిత్రారెడ్డిని ముస్లిం నాయకులు, వార్డ్ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో మైనార్టీల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారన్నారు. నిరుపేద ముస్లింలు వివాహం చేసుకుంటే మేనమామ సాంగ్యం ద్వారా డబుల్ కాట్ బెడ్, బీరువా, మంచం అందజేస్తున్నారని గుర్తు చేశారు. రేణిగుంట టౌన్ ఈద్గాలో నమాజ్ చేసుకునేందుకు ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యేకి తెలియజేయగా ఆయన తక్షణమే స్పందించి గ్రావెల్ తోలించి నమాజ్ చేసుకునేందుకు అనువుగా తయారు చేయించారన్నారు. కాంపౌండ్ వాల్, బరియల్ గ్రౌండ్, తారకరామానగర్‌లో ఈద్గాకి స్థలం వంటి సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, జువ్వల దయాకర్ రెడ్డి, నాయకులు ప్రభాకర్, రసూల్, సుభాన్ రాజా, ఖదీర్, రహీం, జాకీర్ హుస్సేన్, బాబు, రహమతుల్లా, షబీర్, ఇరానీ ఖాదర్ పాల్గొన్నారు.

మణిపూర్ అల్లర్లపై శాంతియుత ర్యాలీ



శ్రీకాళహస్తిలో ర్యాలీగా వెళుతున్న పాస్టర్లు

శ్రీకాళహస్తి: మణిపూర్‌లో అల్లర్లు తగ్గాలని పట్టణంలోని అన్ని చర్చిల పాస్టర్లు ఆదివారం ప్రార్థనలు చేశారు. అనంతరం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో అల్లర్లు చెలరేగడం బాధాకరమన్నారు. అల్లర్లను తగ్గించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కాసా గార్డెన్‌లోని లూథరన్ చర్చి నుంచి ఆర్టీసీ బస్టాండ్, బాబుఅగ్రహారం మీదుగా నెహ్రూ వీధి వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో పాస్టర్లు మైకేల్ బాబు, జీవమణి, సుందర్‌రాజు, ఆంబ్రోస్, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.



రేణిగుంటలో.. మణిపూర్ ఘటనపై నిరసన

రేణిగుంట: మణిపూర్‌లో క్రిస్టియన్లపై దాడిని ఖండిస్తూ జెరూసలెం అపోస్తలిక్ ప్రార్థనా మందిరం పాస్టర్ చంద్రన్‌డేవిడ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు నిరసన ర్యాలీ చేశారు. పాత చెక్‌పోస్ట్ సమీపంలోని చర్చి నుంచి రేణిగుంటలోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. మతపరమైన దాడులు, హింసాత్మక ఘటనలకు బీజేపీ ప్రభుత్వం ఉసిగొల్పుతోందని విమర్శించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. బిజయ్య, అనిల్‌రాజ్ పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో అగ్నిగుండ మహోత్సవం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

పిచ్చాటూరు: ధర్మరాజుస్వామి ఆలయ తిరునాళ్లలో భాగంగా ఆదివారం సాయంత్రం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అంతకు ముందు ఉదయం 7 గంటలకు భీముడు, దుర్యోధనుని వధించే ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. 9 గంటలకు అలుగు ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం దీక్షాపరులు ఏడు ఎల్లలు నడిచి అక్కడి బావుల్లో పుణ్య స్నానాలు ఆచరించి స్థానిక గ్రామ దేవత గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి విశ్వరూపిణి అలంకారంలో ఉన్న ద్రౌపదీ అమ్మవారితో కలిసి ఊరేగింపుగా ధర్మరాజు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం వద్ద ద్రౌపదీ అమ్మవారిని అగ్నిగుండం అభిముఖంగా ఉంచి దీక్షాపరులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. రాత్రి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. కేరళ కళాకారుల వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పిచ్చాటూరు, నారాయణవనం ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, పరమేశ్వర్ నాయక్, సునీల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బైపాస్ నిర్మాణానికి సహకరించండి

- రోడ్డు నిర్మాణాన్ని 150 నుంచి 100 అడుగులకు తగ్గిస్తాం
- పూర్తిగా భూమిని కోల్పోయే రైతులకు అదనంగా ఇంటి పట్టాలు ఇస్తాం
- ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామన్న ఎమ్మెల్యే ఆదిమూలం



భూ నిర్వాసితులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విజ్ఞప్తి చేశారు. ఆదివారం నాగలాపురం మండలం సురుటుపల్లిలోని మిట్టకండ్రిగలో దాసుకుప్పం బైపాస్ రోడ్డు భూ నిర్వాసితుల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాంత రైతుల ఆకాంక్షను వివరించిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు నిర్మాణానికి రూ.26 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. ఇలా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుని త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయడానికి భూ నిర్వాసితులు సహకరించాలని కోరారు. రైతుల విన్నపం మేరకు రోడ్డు వెడల్పును 150 మీటర్ల నుంచి 100 మీటర్లు తగ్గిస్తామని, తక్కువ భూమి (10–20 సెంట్లు) ఉండి పూర్తిగా భూమిని కోల్పోయే రైతులకు వేరే చోట ఇంటి పట్టాలు ప్రభుత్వం ద్వారా మంజూరు చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ హామీల గురించి కలెక్టర్, ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో ఇప్పటికే మాట్లాడానని తెలిపారు. రోడ్డు వల్ల భూమిని కోల్పోయే ప్రతి ఒక్కరిని ఆదుకోవాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు.

బైపాస్‌తో సమగ్రాభివృద్ధి

బైపాస్ రోడ్డు నిర్మాణంతో సత్యవేడు, నాగలాపురం సరిహద్దు ప్రాంతాలు సమగ్రాభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. రోడ్డు పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో భూముల విలువ పెరగడంతో పాటు వ్యాపార అభివృద్ధి చెంది స్థానికులకు జీవనోపాధి కలుగుతుందన్నారు. అదే సమయంలో నియోజకవర్గ ప్రజలు తమిళనాడు భూభాగంలోకి వెళ్లకుండా పర్యటించవచ్చన్నారు. ప్రజలతో పాటు ప్రభుత్వానికి ఏటా రూ.44 లక్షలు ఆదా అవుతుందన్నారు. తమిళనాడులో కిలోమీటరు ప్రవేశించడం వల్ల అక్కడ చిన్న సమస్య తలెత్తినా తమను రాకపోకలకు అనుమతించక ఇబ్బంది పెట్టడాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. మన వాహనాలకు రకరకాలుగా జరిమానాలు, మామూలు వసూలు చేసి వేధించడం నిజం కాదా..? అని ప్రశ్నించారు. ఇవన్నీ పరిష్కారం కావాలంటే మన భూభాగంలో వెళ్లే దాసుకుప్పం బైపాస్ రోడ్డు తప్పనిసరి అని ఈ ప్రాంత వాసుల 3 దశాబ్దాల కోరిక అన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ ధనంజయులు, ఏఈ ఇజ్రాయేల్, సురుటుపల్లి, దాసుకుప్పం సర్పంచ్‌లు కాంతమ్మ, రవిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు, శ్రీపళ్లికొండేశ్వరాలయం చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు రఘు, మాజీ సభ్యులు జయప్రకాష్, సుబ్రమణ్యం, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, లోకయ్య రెడ్డి, రంగనాథం, ఎస్‌ఎం సురేష్, పాలపద్మనాభం, తొప్పయ్య, వీఆర్‌ఓ నాగభూషణం పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు రాజకీయంగా అభివృద్ధి చెందాలి



ఐక్యత చాటుతున్న ముదిరాజ్ నాయకులు

శ్రీకాళహస్తి: ముదిరాజ్‌లు రాజకీయంగా అభివృద్ధి చెందాలని ఆ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నేతలు మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ముదిరాజ్‌లు ఐక్యతతో ఉండాలని సూచించారు. రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. త్వరలో గ్రామ, మండల కమిటీలు, అనుబంధ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కమిటీల ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కన్నయ్య, బత్తినయ్య, వెంకటరమణయ్య, పూల ఆనంద్, చిన్నా, కోటేశ్వరరావు, గోవిందస్వామి, వెంకట కృష్ణయ్య, రాజేంద్ర, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

